సాక్షి
గుంటూరు
శుక్రవారం । 11 । జూలై । 2025



అష్టలక్ష్మి అమ్మవారికి సారె సమర్పణ


నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసం నేపథ్యంలో ఎన్జీఓ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి అమ్మవారికి గురువారం మహిళలు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.



పోలేరమ్మకు కూరగాయల అలంకరణ

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం వాల్మీకినగర్‌లోని గ్రామ దేవత శ్రీపోలేరమ్మ గురువారం శాకంబరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఆదికేశవ స్వామికి గరుడ సేవ



చేబ్రోలు: స్థానిక శ్రీ భూనీలా సమేత ఆది కేశవ స్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి పున్నమి గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి



గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో గల కార్యాలయంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మీడియేషన్(మధ్యవర్తిత్వం)పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా 90 రోజుల ఇంటెన్సివ్ డ్రైవ్‌ను నిర్వహించి కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. న్యాయవాదులందరూ మీడియేషన్‌పై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు శిక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హైకోర్టు ద్వారా నియమించబడిన అడ్వొకేట్‌లు, సీనియర్ ట్రైనర్లు సుదర్శన సుందర్, విజయ కమల మీడియేషన్‌పై అవగాహన కల్పించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం సమీపంలో శుక్రవారం జరిగే ప్రపంచ జనాభా దినోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం ఉదయం రాష్ట్ర ఫైనాన్స్ - ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ అనంత శంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ పరిశీలించారు. సభాస్థలి, వాహనాల పార్కింగ్, సీటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవి కుమార్, రమణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర్, డీపీఓ నాగ సాయికుమార్, సీఆర్డీఏ ఈఈ శ్రీనివాసరావు, డీఎస్‌డబ్ల్యూఆర్‌ఐ సురేష్, తుళ్లూరు, గుంటూరు తూర్పు తహసీల్దారులు సుజాత, వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దాడి కేసు ప్రథమ నిందితుడు?

తెనాలి రూరల్: తెనాలిలో కానిస్టేబుల్‌పై నలుగురు యువకులు ఏప్రిల్‌లో దాడి చేయడం, అందులో ముగ్గురికి పోలీసులు బహిరంగంగా థర్డ్ డిగ్రీ ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. తెనాలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కన్నా చిరంజీవి విధులకు వెళుతుండగా ఏప్రిల్ 24వ తేదీ రాత్రి ఐతానగర్‌లో నలుగురు యువకులు అతడిపై దాడి చేశారు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఐతానగర్‌కు చెందిన వేము నవీన్ అలియాస్ కిల్లర్, చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్, షేక్ బాబులాల్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నవీన్ పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురిని పోలీసులు ఏప్రిల్ 27న అరెస్ట్ చేశారు. తాజాగా పోలీసులు ప్రధాన నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వివాదం జరిగిన రోజున కానిస్టేబుల్ చిరంజీవికి, నవీన్‌కు మధ్య ఘర్షణ జరిగిందని, జాన్ విక్టర్, రాకేష్, బాబులాల్ అక్కడే ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. పొరుగున ఉన్న బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలో స్నేహితుడి ఇంట్లో తలదాచుకుంటున్న నవీన్ గురువారం బయటకు రావడంతో నిఘా ఉంచిన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

శాకంబరిగా బాల చాముండేశ్వరి



అమరావతి: అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం బాల చాముండేశ్వరి దేవి భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కూరగాయలతో ఆకర్షణీయంగా అలంకరించారు.

ఐకమత్యంతోనే శత్రువుపై విజయం

- జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపు
- మోసానికి బ్రాండ్ అంబాసి'డర్' బాబు
- అధికారం కోసమే తప్పుడు హామీలు
- మోసం చేసి ఎన్నికల్లో గెలుపు



స్కానర్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి, కార్యకర్తలు

పట్నంబజారు: రాష్ట్రంలో చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చేది మోసమని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' స్కానర్ పోస్టర్‌లను ఆవిష్కరించారు.

సుపరిపాలన కాదు.. మోసాల పాలన



అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ఏ ఒక్క హామీ నెరవేర్చిన పాపాన పోలేదని విమర్శించారు. ఏడాదిలో సుపరిపాలన అందించామని చంద్రబాబు చెప్పుకుంటున్నారని, ప్రజలు సంతోషంగా ఉంటేనే సుపరిపాలన అవుతుంది తప్పా, సంక్షోభం ఉంటే కాదని తెలిపారు. 40 శాతం ఓట్లు వచ్చిన వైఎస్సార్ సీపీకి 40 సీట్లు రాలేదని, అందులో కచ్చితంగా సాంకేతిక లోటుపాట్లు, మోసాలున్నాయని ఆరోపించారు. 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమానికి సంబంధించి పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్‌లలో తాము పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. స్కానర్‌లను చూపించి చంద్రబాబు ఇచ్చిన హామీలు, అమలు పరిచిన పరిస్థితులను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. తల్లికి వందనం ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తామని చెప్పి, తీరా కొంత మందికి మాత్రమే రూ. 13వేలు చొప్పున చంద్రబాబు ఇచ్చారని తెలిపారు. రెండో బిడ్డ ఉంటే కేవలం రూ. 10వేలు పడుతుందని పలువురు చెబుతున్నారన్నారు. సూపర్ -6 అన్ని ఇచ్చేశామని, అడిగిన వారి నాలుక మందమనే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అంబటి ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.59 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉంటే 30 నుంచి 40 మందికి దీపం పథకం ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఏడాది పాలనలో సాగిందంతా కేసులు పెట్టడం, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధింపులకు గురి చేయడం తప్ప ఏమీ లేదని విమర్శించారు. చివరికి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటలను అడ్డుకునే దుస్థితికి కూటమి ప్రభుత్వం దిగజారిందని తెలిపారు. విభేదాలను పక్కనబెట్టి భవిష్యత్తులపై శత్రువుపై విజయం సాధించే దిశగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే ఓనర్లు



వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే ఓనర్లు అని పార్టీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి చెప్పారు. కష్టకాలంలో పార్టీ కోసం కార్యకర్తలు ఎంతో బాధ్యతతో పని చేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోయాక నేతలు పక్క పార్టీలోకి వెళ్లారు తప్పా, కార్యకర్తలు ఒక్క అడుగు కూడా పక్కకు వేయలేదని పేర్కొన్నారు. అంబేడ్కర్‌ను చూస్తే రాజ్యాంగం గుర్తుకు వస్తుందని, మహాత్మాగాంధీని చూస్తే స్వాతంత్ర్యం గురించి తెలుస్తుందని, భవిష్యత్తు తరాలు పక్కవారిని మోసం చేయాలంటే చంద్రబాబు విగ్రహానికి దండం పెట్టుకుంటే సరిపోతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మహానేత వైఎస్సార్ మరణం తరువాత ఆయన విలువ తెలిసిందని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి తరువాత ప్రజలకు విలువ తెలిసొచ్చిందని తెలిపారు. చంద్రబాబు అబద్ధాలతోనే వైఎస్సార్ సీపీ ఓటమి పాలైందని, కచ్చితంగా అందుకు బదులు తీర్చుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని చెప్పారు. గుంటూరు పశ్చిమలో ఎమ్మెల్యే అంటే ఎం అంటే మోదుగుల, ఎల్ అంటే లేళ్ల అప్పిరెడ్డి, ఏ అంటే అంబటి రాంబాబు అని, తామంతా ఐకమత్యంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఎన్నికల తరువాత హామీలపై చంద్రబాబును నిలదీయలేకపోతున్న పవన్ కల్యాణ్‌కు సిగ్గు లేదా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు తమ నాయకుడని చెప్పుకుంటున్నాడని, అతను చేసే అన్యాయాల్లో సగ భాగం కూడా పంచుకుంటున్నావా ? అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా శ్రేణులు ముందుకు సాగాలని చెప్పారు. 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు అనుబంధ విభాగాల అధ్యక్షులు సి.డి.భగవాన్, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, పఠాన్ సైదాఖాన్, దానం వినోద్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సురసాని శ్రీనివాసరెడ్డి, పార్టీ మహిళ విభాగం నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, జిల్లా, నగర కమిటీ నేతలు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



అధికారం కోసమే రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీలతో కూడిన కూటమి ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి తప్పుదోవ పట్టించిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఆరోపించారు. ప్రజలను చైతన్యవంతుల్ని చేసే దిశగా ప్రతి ఇంటికి వెళ్లే ఈ మహత్తర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ విధానాలను నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వై.ఎస్.జగన్ మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా చూస్తే, బాబు దాన్ని బుట్టదాఖలు చేశారని మండి పడ్డారు. ఏడాదిలోపే అనేక ఉద్యమాలతో ప్రజలకు, రైతన్నలకు, విద్యార్థి యువజనులకు, మహిళలకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచిందని తెలిపారు. కూటమి పాలన ప్రారంభించిన నాటి నుంచి అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలతో కాలం వెళ్లదీస్తోందని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఏ ఒక్క భయానికి తలవంచకుండా ఎత్తిన జెండాను భుజాన దించకుండా కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.

కొలిక్కిరాని బది'లీలలు'

- సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద వెల్ఫేర్ సెక్రటరీల పడిగాపులు
- సుదూర సచివాలయాలకు బదిలీ



నెలల చిన్నారితో గుంటూరు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయానికి వచ్చిన ఓ ఉద్యోగిని

నెహ్రూనగర్: ఉమ్మడి జిల్లా రూరల్ పరిధిలో పనిచేసే గ్రామ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సెక్రటరీల బదిలీల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలేదు. సొంత మండలంలో పని చేయకూడదనే ప్రభుత్వ ఉత్తర్వులను ఆధారం చేసుకుని అధికారులు ఇష్టానుసారంగా బదిలీలు చేశారు. ఈ నెల 7న వెలువడిన ఉత్తర్వులు చూసి సెక్రటరీలు కంగుతిన్నారు. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు బదిలీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ

ఉమ్మడి గుంటూరులో 874 మంది వెల్ఫేర్ సెక్రటరీలు ఉన్నారు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే వెబ్ ఆప్షన్స్(గూగుల్ ఫాం) ఇచ్చి బదిలీల ప్రక్రియను అస్తవ్యస్తంగా నిర్వహించారు. చాలా మందిని ప్రస్తుత సచివాలయం నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి బదిలీ చేశారు. దీంతో ప్రతిరోజూ వందల మంది సచివాలయ సెక్రటరీలు గుంటూరు నగరంలోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయానికి వస్తున్నారు. తమను అంత దూరానికి బదిలీ చేస్తే ఏ విధంగా వెళతామంటూ అధికారులను వేడుకొంటున్నారు.

ముడుపులకే ప్రాధాన్యం

నిబంధనల ప్రకారం స్పౌజ్ కేటగిరికి ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే, అధికారులు ముడుపులు తీసుకుని కొందరికి నచ్చిన స్థానంలో పోస్టింగ్ ఇచ్చారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో పనిచేసే సెక్రటరీలకు బదిలీల ప్రక్రియ భారంగా మారింది. ప్రతి రోజు అక్కడ నుంచి గుంటూరు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయానికి పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, న్యాయబద్ధంగా బదిలీల ప్రక్రియ జరపాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే నరేంద్రపై అట్రాసిటీ కేసు పెట్టాలి



మాట్లాడుతున్న టీజేఆర్ సుధాకర్‌బాబు, పక్కన అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్
- ఆస్పత్రిలో నాగమల్లేశ్వరరావుకు పరామర్శ
- పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా

గుంటూరు ఎడ్యుకేషన్: దళిత సర్పంచ్‌పై టీడీపీ గూండాలతో దాడి చేయించిన పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. టీడీపీ గూండాల చేతిలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ పరిస్థితుల్లో గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పొన్నూరు మండలం మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వరరావును గురువారం పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో కలిసి ఆయన పరామర్శించారు. అధైర్యపడవద్దని, అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

నరేంద్రను ఏ–1గా చేర్చాలి

సుధాకర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ రాజకీయంగా చైతన్యవంతమైన పొన్నూరు నియోజకవర్గంలో ధూళిపాళ్ల నరేంద్ర బహిరంగంగా చేసిన వ్యాఖ్యల కారణంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయని విమర్శించారు. మన్నవ గ్రామ సర్పంచ్‌పై దాడి ఘటనలో నరేంద్రను ఏ–1గా చేర్చాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో పెద్ద నాయకుడైన నాగమల్లేశ్వరరావు ఆధిపత్యాన్ని సహించలేక అతనికి ప్రత్యర్థిగా ఉన్న టీడీపీ నాయకుడిని ఉసికొల్పి, ఇద్దరు దళితుల మధ్య హత్యాకాండకు నరేంద్ర తెరతీశాడని ఆరోపించారు. ఆయన చేసిన పాపం ఊరికే పోదని తెలిపారు. వారం రోజులు గడిచినా నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హత్యా రాజకీయాలకు తెర తీశారని ధ్వజమెత్తారు. వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్తను నడిరోడ్డుపై నరికి చంపితే దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ పేరుతో సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్‌లు ఎల్లకాలం అధికారంలో ఉండరని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలిచేది వైఎస్ జగన్ అని, వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో ముగ్గురు దళిత ఎమ్మెల్యేలు ఉన్నా దాడులను ఖండించక పోవడం సిగ్గుచేటని ఖండించారు. వారు తక్షణమే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. చైతన్యవంతులైన మాల, మాదిగ ప్రజలు, విద్యావంతులు దళిత వ్యతిరేకిగా ఎమ్మెల్యే నరేంద్ర సాగిస్తున్న అరాచకాలపై గళం విప్పాలని ఆయన పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కారు కింద పడి మరణించిన గోవతోటి రాంబాబు మృతి విషయాన్ని బయటకు పొక్కకుండా రూ.10 లక్షలతో రాజీ కుదుర్చుకున్నారని వెల్లడించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు శీలం పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, నాయకులు సురేంద్ర, బూదాల శ్రీనివాసరావు, ఎండీ గోరేబాబు, డేవిడ్‌రాజు, ముగ్గ గవాస్కర్, శామ్యూల్ పాల్గొన్నారు.

14న తెనాలి ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా

తెనాలి అర్బన్: పీఎం నేషనల్ అప్రెంటిస్ మేళాను ఈ నెల 14న తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులంతా బయోడేటాతో పాటు విద్యార్హత, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఉదయం 10.30 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9959828100 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా నెత్తిన అధిక జనాభా కత్తి

- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం
- 52లక్షలకు చేరిన జిల్లా జనాభా

గుంటూరు మెడికల్: దేశాభివృద్ధి జనాభాపై ఆధారపడి ఉంటుంది. కొన్ని దేశాలు అత్యధిక జనాభాతో అల్లాడిపోతుంటే మరికొన్ని లేక ఇబ్బంది పడుతున్నారు. జనాభా పెరుగుదల కోసం ప్రజలకు ఆయా దేశాలు పలు ప్రోత్సాహకాలు సైతం అందిస్తున్నాయి. అయితే, మన దేశంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రోజురోజుకూ జనాభా పెరిగిపోతోంది. జిల్లాలోనూ పెరుగుదల రేటు గణనీయంగా ఉంది. 2001లో ఉమ్మడి గుంటూరు జిల్లా జనాభా 44,65,144 ఉండగా 2011లో 48,87,813 మంది ఉన్నారు. కరోనా నేపథ్యంలో 2021లో జనాభా లెక్కల సేకరణ వాయిదా పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లా జనాభా 2024 నాటికి 52,04,289 మంది ఉండొచ్చని వైద్య అధికారులు అంచనా వేశారు. కేవలం ఒక్క గుంటూరు జిల్లా జనాభా 22,26,467 మంది ఉన్నారు. ప్రతి ఏడాది జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అధిక జనాభా వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా దీన్ని నిర్వహిస్తున్నారు.

గతంలో జనాభా నియంత్రణకు ఆరుసార్లు రాష్ట్ర అవార్డులు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు అత్యధికంగా చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆరుసార్లు వరుసగా రాష్ట్ర అవార్డులు అందుకుని డబుల్ హ్యాట్రిక్ సాధించింది. డాక్టర్ మీరావత్ గోపీనాయక్ ఆధ్వర్యంలో 2009–10లో తొలిసారిగా జిల్లా వైద్యారోగ్యశాఖకు ఈ అవార్డు లభించింది. వైద్య ఆరోగ్యశాఖ ఏర్పడిన 50 ఏళ్లలో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అవార్డు రావడం ఇదే ప్రథమం. నాటి నుంచి వరుసగా 2010–11లో, 2011–12లో, 2012–13లో, 2013–14లో, 2015–16లో వరుసగా అవార్డు పొందింది. ఇప్పటివరకు ఏ జిల్లా కూడా సాధించని డబుల్ హ్యాట్రిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సాధించి రాష్ట్రంలో చరిత్ర సృష్టించింది. తర్వాత ప్రభుత్వం అవార్డులను నిలిపివేసింది. ఆరోగ్య కార్యక్రమాల అమలుకు ప్రోత్సాహకాలు లేకపోవడంతో నేడు చిట్టచివరన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిలిచింది.



గ్రామాల్లోనే జనాభా అధికం

సంవత్సరం	గ్రామీణం	పట్టణం
2011	32,35,075	16,52,738
2024	34,44,539	17,59,750

ఉచితంగా ఆపరేషన్లు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జనాభా నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్నాం. పెళ్లైన వెంటనే గర్భం రాకుండా కుటుంబ నియంత్రణ పద్ధతులు ప్రజలు పాటించేలా వైద్య సిబ్బంది పని చేస్తున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునే స్త్రీలకు, పురుషులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

జీజీహెచ్‌లో అధికంగా ఆపరేషన్లు



గుంటూరు జీజీహెచ్ కుటుంబ నియంత్రణ విభాగంలో ప్రతినెలా అధిక మొత్తంలో ఆపరేషన్లు చేస్తున్నాం. జిల్లాలో అత్యధికంగా కు.ని. ఆపరేషన్లు చేస్తున్నందుకు ప్రతి ఏడాది జీజీహెచ్ కుటుంబ నియంత్రణ వైద్య విభాగానికి అవార్డును ఇస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు ఐదు నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. చేసిన రోజే ఇంటికి వెళ్లి పోవచ్చు.

– డాక్టర్ యశస్వి రమణ, సూపరింటెండెంట్

ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రుల అభివృద్ధికి ప్రణాళిక

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి మనోహర్, కలెక్టర్ నాగలక్ష్మి

తెనాలి అర్బన్: వచ్చే ఏడాది మార్చి నాటికి తెనాలి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశానికి మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి ఏడాది రోడ్ల మరమ్మతులు, విస్తరణపై దృష్టి సారించినట్లు చెప్పారు. రెండో ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల్లో మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. పీ–4 కార్యక్రమంలో భాగంగా పలువురు దాతలను గుర్తించి, వారితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు విద్యతో పాటు స్కిల్స్‌ను కూడా డెవలప్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు షైనింగ్ స్టార్స్ కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యాశాఖకు ప్రభుత్వం రూ.36వేల కోట్లు వెచ్చిస్తోందని, ఆ స్థాయిలో ఫలితాలు రావడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడు నెలల్లో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామని, విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ఆస్తులను కూడా జప్తు చేస్తామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందంగా, ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పాఠశాలలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. తొలుత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈవో సీవీ రేణుక, ఈగల్ విభాగ ఎస్పీ కె.నగేష్‌బాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంఈవో-2 వి.జయంతిబాబు, డెప్యూటీ డీఈవో శాంతకుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఐ.పద్మావతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వి.శాంతి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 743

కొమ్ములు : 541 బస్తాలు	(ధర రూ॥ల్లో)	
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,725	10,100

కాయలు : 202 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,100	10,100	10,100

మొత్తం అమ్మకాలు : 557.250 క్వింటాళ్లు

-దుగ్గిరాల

వాణిజ్యం



నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,480
అమ్మకాలు	44,205
నిల్వ	7,114

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	9,500-12,800
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	9,500-12,800
నంబరు-5	10,000-13,200
273	9,800-12,400
341	10,000-13,500
4884	10,000-12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 13,500
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 11,200
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000-13,400
బాడిగ - 355	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

అప్పు చేసి పప్పు కూడు

- సంవత్సరం నుంచి అందని డైట్ బిల్లులు
- రూ.50లక్షలు దాకా బకాయిలు
- ఇబ్బంది పడుతున్న హాస్టల్ వార్డెన్స్

నెహ్రూనగర్: ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో గుంటూరు అర్బన్ సాంఘిక సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లకు అప్పుల బాధ ఎక్కువైంది. డైట్ చార్జీలను ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో వ్యాపారుల నుంచి సరుకుల అప్పులకు తీసుకువచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్నారు. సుమారు సంవత్సరం నుంచి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. అప్పులు పెరిగిపోతుండటంతో వ్యాపారుల నుంచి వార్డెన్స్‌కు తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

గుంటూరు అర్బన్‌లో 13 హాస్టల్స్

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 34 సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 2,372 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌కు నెలకు రూ.1600, ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌కు నెలకు రూ.1400 ప్రభుత్వం చెల్లిస్తోంది. గుంటూరు అర్బన్ పరిధిలో 13 హాస్టల్స్ ఉన్నాయి. అయితే, అర్బన్ పరిధిలోనే జిల్లా హెడ్ క్వార్టర్ ఉండటంతో విద్యార్థులు ఎక్కువగా గుంటూరు అర్బన్ పరిధిలో ఉండే హాస్టల్స్‌లో ఉండేందుకు మక్కువ చూపుతుంటారు. ప్రస్తుతం అర్బన్ పరిధిలో 1,800 మంది దాకా ఉన్నారు. భారీగా విద్యార్థులు ఉన్నా సంక్షేమ శాఖ అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. కొంత మంది వార్డెన్స్‌కు గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు, మరి కొంత మందికి ఫిబ్రవరి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.50లక్షలు దాకా బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విధంగా గత ఏడాది కూడా రూ.60లక్షలకు సంబంధించిన బిల్లులు సకాలంలో ప్రాసెస్ చేయకపోవడంతో అవి మురిగిపోయాయి. దీనిపై అధికారులు కూడా చర్యలు తీసుకోలేదు.



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

జిల్లా పర్చేజ్ కమిటీ ఏర్పాటు చేయాలి

గతంలో జిల్లా పర్చేజ్ కమిటీ ద్వారా హాస్టల్స్‌కు కోడిగుడ్లు, కూరగాయలు, చికెన్, పాలు, పెరుగు మినహా మిగిలిన అవసరమైన సరుకులు సరఫరా అవుతుండేవి. అయితే, రెండేళ్ల నుంచి ఈ ప్రక్రియ ఆగిపోవడంతో సమస్య మొదలైంది. వార్డెన్స్ వ్యాపారుల నుంచి అప్పు మీద సరుకులు తెచ్చుకుని విద్యార్థులకు భోజనం పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సకాలంలో బిల్లులు ప్రాసెస్ కాకపోవడంతో తీసుకున్న అప్పు చెల్లించాలంటూ వ్యాపారులు ఇబ్బందులు పెడుతున్నారంటూ కొంత మంది వార్డెన్లు వాపోతున్నారు. జిల్లా, డివిజనల్ పర్చేజ్ కమిటీలు ఉంటే తమకు నెల నెలా సరుకులు కొనే అవస్థలు ఉండవని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు సకాలంలో చెల్లించేందుకు చొరవ చూపాలని వార్డెన్లు కోరుతున్నారు. డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న అంశాన్ని ఎస్సీ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలిస్తామని ఆయన చెప్పారు.

తుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణానికి కార్యాచరణ

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం నుంచి బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం వరకు అడవిలోనుంచి నాలుగున్నర మీటర్ల వెడల్పుగల రోడ్డు, ఇటీవల కూల్చివేతకు గురైన తుల్జాభవానీ దేవాలయ పునర్నిర్మాణాలకు అటవీ శాఖాధికారులు గురువారం కార్యాచరణ ప్రారంభించారు. వీటి సాధనకోసం తాము ఢిల్లీ వరకు వెళ్లి ఫారెస్ట్ కన్జర్వేటివ్ అధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని అఖిలభారత గిరిజన వికాస పరిషత్ అధ్యక్షుడు భూక్యా తులసీనాయక్ (బీటీ నాయక్), కార్యదర్శి భూక్యా రమేష్ నాయకులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్రిటిష్ కాలంలో ఉన్న నాలుగున్నర మీటర్ల వెడల్పుగల రోడ్డు నిర్మాణానికి, అడవి మధ్యలో ఉన్న తమ ఆరాధ్య దేవత తుల్జా భవానీ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి కావలసిన భూమి కేటాయింపునకు అధికారులు సర్వే నిర్వహించారన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే అచ్చంపేట, బెల్లంకొండ మండలాల మధ్య దూరం తగ్గి రాకపోకలకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు పాత రికార్డులు, శాటిలైట్ పిక్చర్స్ పరిశీలించి బాట ఉన్న విషయాన్ని రూఢీ చేసుకున్నారన్నారు. అదేవిధంగా అమ్మవారి దేవాలయానికి అనువైన స్థలం కోసం అన్వేషించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెస్సర్స్ మరోని ఇన్‌ఫ్రా సంస్థ మేనేజర్ జి.బాలాజీ, సివిల్ ఇంజినీర్ డి.నాగరాజు, నరసరావుపేట ఫారెస్ట్ రేంజర్ అధికారి అడవిలో అనువైన స్థలాలను పరిశీలించారన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, వెంకటాయపాలెం సర్పంచ్ భూక్యా నాగమ్మ, మాజీ సర్పంచ్ మేళం శ్రీరామమూర్తి, హన్మంత్ నాయక్, ఆర్యవైశ్య నాయకులు దేవరశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుట్లగూడెం అడవిలో సర్వే నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షలు సాయం

నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి తోటి హోంగార్డులు అండగా నిలిచారు. మృతుని కుటుంబానికి ఒక రోజు వేతన మొత్తం రూ.5 లక్షలను సాయంగా అందించారు. తెనాలి రూరల్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తూ హోంగార్డు వై.శ్రీనివాస్ ఈ ఏడాది ఫిబ్రవరి 18వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. హోంగార్డు కుటుంబానికి అండగా నిలిచేందుకు తోటి హోంగార్డులు ముందుకు వచ్చారు. ఒక రోజు వేతనాన్ని సాయంగా అందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ చేతుల మీదగా శ్రీనివాస్ కుటుంబసభ్యులకు సాయం చెక్‌ను అందజేశారు. హోంగార్డు కుటుంబానికి సాయం చేసేందుకు ముందుకు వచ్చిన జిల్లా హోంగార్డులను అదనపు ఎస్పీ అభినందించారు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గుండెపోటు కారణంగా ఉద్యోగ విరమణ చేసిన బండ్లమోటు పీఎస్ హోంగార్డు ఎ.నాసరయ్యకు రూ.5 లక్షల చెక్‌ను అదనపు ఎస్పీ సంతోష్ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ పాల్గొన్నారు.



హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ జేవీ సంతోష్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

గురజాల: అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ బి.జగదీష్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన మంచికల్లు గ్రామానికి చెందిన బొల్లెద్దుల కోటేశ్వరరావు దంపతులు గురజాల బైపాస్ మీదుగా దాచేపల్లికి వెళ్తుండగా మార్గం మధ్యలో జగనన్న కాలనీ వద్ద మహిళ మెడలోని నానుతాడు అపహరణకు గురైందన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో దంపతులు ఫిర్యాదు చేశారన్నారు. సీఐ ఆవుల భాస్కర్ టీంను ఏర్పాటు చేసి విచారణ సాగించారని, పలు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా విచారణలో నిందితుడు తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం బాలాజీ నగర్ తండాకు చెందిన బర్మవత్ నాగరాజుగా గుర్తించామని చెప్పారు. అతడిని విచారించగా చైన్ స్నాచింగ్‌ను ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద రూ.10 లక్షలు విలువ కలిగిన 92 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాగరాజు డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తు జీవనం సాగిస్తుంటాడన్నారు. అతను ఫిబ్రవరి నెల 16వ తేదీన నరసరావుపేట సత్తెనపల్లి మధ్య మాదాల గ్రామం వద్ద టీవీఎస్‌పై భర్తతో కలిసి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును, 19వ తేదీన పిడుగురాళ్ల మండలం శ్రీనివాసపురం వద్ద ఓ మహిళ మెడలో చైన్ లాక్కొని వెళ్లి పోయినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. నందిగామ, గండేపల్లి, వత్సవాయి, చిల్లకల్లు, తెనాలి త్రీ టౌన్, పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు సంబంధించి పలు కేసులు ఇతనిపై ఉన్నాయన్నారు. కేసును ఛేదించిన సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై.వినోద్ కుమార్, బి.అనంత కృష్ణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రేపు వాటర్ పోలో జట్ల ఎంపికలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలోని స్విమ్మింగ్ పూల్‌లో సబ్ జూనియర్స్, జూనియర్స్ జిల్లా వాటర్ పోలో జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీలలో విశాఖపట్నం బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న 10వ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5గంటల లోపు స్విమ్మింగ్ పూల్ కార్యాలయంలో ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని



సత్తెనపల్లి: 12వ పీఆర్సీ, ఐఆర్, డీఏలు, ఎరియర్స్‌పై పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం చేయమన్న పనులు, ఇవ్వమన్న రిపోర్టులు క్షణాల మీద నిద్రాహారాలు మానేసి సమయానికి ఇస్తున్నా ప్రభుత్వ ఉద్యోగస్తులకు 12వ పీఆర్సీ, ఐఆర్, డీఏలు, ఎరియర్స్‌పై మాత్రం మౌనంగా ఉంటున్నారని విమర్శించారు. ఇది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను నిరాశ నిస్పృహలకు గురి చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు.

నెలాఖారులోగా పనులు పూర్తి చేస్తాం


ఎన్నెస్పీ డీఈ విజయలక్ష్మి

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో జరుగుతున్న మేజరు కాల్వ అభివృద్ధి పనులు ఈనెలాఖారులోగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టినట్లు లింగంగుంట్ల ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి చెప్పారు. గురువారం పొట్లూరు గ్రామానికి చెందిన లింగా రత్తమ్మ తన పొలానికి సాగునీరు ఇవ్వటం లేదని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయిలో విచారణ నిమిత్తం మేజరు కాల్వను పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం పెరుగుతుందని, ఉన్నతాధికారు ల సమావేశం అనంతరం ఎబీసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్న ట్లు తెలిపారు. ఏబీసీ కెనాల్ పరిధిలో ఉన్ననటువంటి మేజరు కాల్వలు రూ.60 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి విధివిధానాలు అధికారులకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. పొట్లూరు మేజరు కాల్వ పరిధిలో నూతన సైఫన్ నిర్మాణ పనులకు రూ.30లక్షల నిధులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. వీఆర్వో నరసింగరావు, ఎన్నెస్పీ ఏఈ పొట్లూరు లక్ష్మీనారాయణ రైతులు ఉన్నారు.

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం ప్రతిభావంతులైన పిల్లల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ప్రసూన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసాధారణమైన ధైర్యసాహసాలతో, సామర్థ్యాలు , అత్యుత్తమ విజయాలు కలిగిన 18 సంవత్సరాలలోపు పిల్లలకు తగిన గుర్తింపు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు 2026 ప్రకటించిందన్నారు. ఇతరులకు ఆదర్శంగా, క్రీడలు, సామాజిక సేవ, సైన్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, నూతన ఆవిష్కరణలు మొదలగు వాటిల్లో ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉన్న చిన్నారులు ఈ నెల 31వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్ వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి



వినుకొండ: వినుకొండ రూరల్ మండలం, గోకనకొండ గ్రామానికి చెందిన పాలపర్తి ఆంజనేయులు(45) ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతిచెందాడు. ఈనెల 8వ తేదీన గ్రామ సమీపంలో బహిర్భూమికని వెళ్లి గ్రామ శివారులో గల పొలంలో ఉన్న నీటి కుంటలో పడి మృతిచెందాడు. మరుసటి రోజు ఉదయాన్నే బంధువులు వెతుక్కుంటూ నీటి కుంట వద్దకు వెళ్లి చూడగా శవమై తేలియాడుతున్నట్లు సమాచారం. మృతునికి భార్య ఏగేశ్వరమ్మ, కుమారుడు అనిల్, కుమార్తె అఖిల ఉన్నారు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడిగా యోగిష్ చంద్ర

కొరిటెపాడు(గుంటూరు): లఘు ఉద్యోగ భారతి సర్వసభ్య సమావేశాన్ని అరండల్‌పేటలోని యోగి భవన్‌లో గురువారం నిర్వహించారు. ఇందులో గత రెండు సంవత్సరాల సంస్థ ప్రగతి, ఆర్థిక నివేదికను సమర్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లఘు ఉద్యోగ భారతి అఖిల భారత సంఘటన్ కార్యదర్శి ప్రకాష్ చంద్ర హాజరయ్యారు. రాష్ట్ర లఘు ఉద్యోగ భారతి నూతన కమిటీని ప్రకటించి, మార్గనిర్దేశం చేశారు. ప్రకాష్ చంద్ర మాట్లాడుతూ దేశాభివృద్ధికి చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు ముందుకు రావాలని కోరారు. చిన్న తరహా పరిశ్రమలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి 'లఘు ఉద్యోగ భారతి' జాతీయ స్థాయిలో పోరాడుతుందని వివరించారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా తులసి యోగిష్, ప్రధాన కార్యదర్శిగా అట్లూరి రమేష్, కోశాధికారిగా ధరణీష్ ధనికుల, ఉపాధ్యక్షులుగా కమల నయన్ బంగ్, రామలింగ, నల్లమోతు శివ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శులుగా అట్లూరి సునీతా నారాయణ, హరిదాసుల చంద్రశేఖర్, తోట రామకృష్ణ, దాట్ల తిరుపతి రాజుతో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా శ్రీధర్ చిట్టిప్రోలు, విఠల్ ప్రసాద్, మార్పు వెంకటేశం, పందిళ్లపల్లి ప్రవీణ్, రాజులపాటి వెంకట రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకాష్ చంద్ర ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తులసి యోగిష్ చంద్రను పలువురు సభ్యులు అభినందించారు. తులసి గ్రూప్ అధినేత తులసి రామచంద్ర ప్రభు, పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్ కుమార్, రామచంద్ర బ్రదర్స్ అధినేత పుప్పాల సుబ్బారావు, ఆక్వా వాటర్ కంపెనీ అధినేత సాయి, సత్యా ఇంపెక్స్ అధినేత తోట రామకృష్ణలు వివిధ చిన్న తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారానికి శాయశక్తులా పనిచేస్తానని, అయితే సభ్యుల సంఖ్య పెరిగినప్పుడే మన వాణి గట్టిగా వినిపించటానికి అవకాశం ఉంటుందని ప్రకాష్ చంద్ర తెలిపారు. సభ్యుల సంఖ్య 150 నుంచి 1,000 వరకు పెరగడానికి కృషి చేస్తానని తులసి యోగిష్ చెప్పారు.



నూతనంగా ఎన్నికైన కమిటీతో ప్రకాష్ చంద్ర, తులసి యోగిష్ చంద్ర తదితరులు

పాత జాతీయ రహదారిపై కారు బీభత్సం


వీఆర్వోతో పాటు మరో నలుగురికి గాయాలు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా వీఆర్వోతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వైద్యం నిమిత్తం వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నుంచి ప్రకాశం బ్యారేజ్ వైపు అతి వేగంగా వెళుతున్న కారు పాత జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ దగ్గర ఎదురుగా వస్తున్న నాలుగు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. తొలుత పెదకాకాని నుంచి బదిలీ అయి ఇప్పటం వీఆర్వోగా విధులకు హాజరయ్యేందుకు నులకపేటలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న జయంతి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఐదు అడుగులు పైకి లేచి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆమెకు కుడి కాలు మోకాలి వద్ద విరిగిపోయింది. వీఆర్వో ద్విచక్ర వాహనం అనంతరం కారు మరో రెండు వాహనాలను ఢీకొంది. ఇందులో ఇద్దరు పురుషులు, మహిళ, చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. వీఆర్వోను 108 వాహనంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగిలిన నలుగురిని స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు అతి వేగంగా ఉండవల్లి సెంటర్ వైపు వెళ్లడంతో యువకులు ఆపేందుకు ప్రయత్నించారు. డ్రైవర్ వారి వాహనాలను సైతం ఢీకొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనపై తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్య, ఆర్ఐ వేదాంతం వివరాలు సేకరిస్తున్నారు.



తుక్కుతుక్కు అయిన వీఆర్వో ద్విచక్ర వాహనం

వ్యాసాయ.. విష్ణురూపాయ!



వ్యాస భగవానునికి పూజలు చేస్తున్న భవఘ్ని గురూజీ



వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో మాట్లాడుతున్న భవఘ్ని గురూజీ

వైకుంఠపురం భవఘ్ని ఆరామంలో ఘనంగా గురు పూర్ణిమ

అమరావతి: సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించి అందరికీ మార్గదర్శకంగా నిలిచే గురువుగా, వేదవ్యాసుడిగా అవతరించాడని భవఘ్ని గురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామంలోని వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో గురుపూర్ణిమ వేడుకలలో చివరి రోజున వ్యాస ఆరాధన ఘనంగా నిర్వహించారు.

భవఘ్ని గురూజీ మాట్లాడుతూ వేద వ్యాసుడు నాలుగువేదాలు, అష్టా దశ పురాణాలతో పాటుగా మహాభారతాన్ని మానవాళికి అందించాడన్నారు. మానవుడిని సన్మార్గంలో నడిపించి, అధ్యాత్మిక జ్ఞానసంపదను అందించిన గురువులను స్మరించుకోవటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా ఆదిగురువు వ్యాస భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదవ్యాస భగవానుని ఆశీర్వచనం అందరికీ అందించారు. వేడుకల్లో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో...

పవిత్ర పుణ్యక్షేత్రమైన అమరావతి శ్రీ షిర్డీసాయి - పర్తిసాయి కపోతేశ్వర ధ్యాన మందిరంలో గురుపూర్ణిమ వేడుకలను గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువజామునే బాబావారికి సుప్రభాతసేవ, నగర సంకీర్తన, షిర్డీ హారతి కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తర్వాత బాబా విగ్రహానికి పంచామృతాలతో మహాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం దత్తాత్రేయ, షిర్డీబాబా, సత్యసాయిబాబా చిత్రపటాలకు, బాబావారి పాదుకలకు భక్తులతో పూజలు చేయించారు. చివరగా అన్నదానం నిర్వహించారు,.

రైతు సంఘం నేతపై టీడీపీ నాయకుల దాడి

క్రోసూరు అమరావతి బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

క్రోసూరు: కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సీజీజీబీ బ్యాంకులో గోల్డ్ బాధితులకు అండగా నిలిచి పోరాడుతున్న రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావుపై దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాను, అతని తమ్ముడు సమీర్ దాడిచేశారని బాధితుడితో కలిసి సీపీఎం నేతలు గురువారం క్రోసూరులోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. ఈ విషయమై బాధితుడు తిమ్మిశెట్టి మాట్లాడుతూ తాను దొడ్లేరు గ్రామం వెళ్తుండగా, టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాను, అతని తమ్ముడు దారికాచి దుర్భాషలాడుతూ నీకు ఇక్కడేం పని.. దొడ్లేరు ఎందుకొస్తున్నావంటూ దాడిచేసి కొట్టారని తెలిపాడు. గతంలో సాగు నీరు విషయమై కూడా దౌర్జన్యం చేశారని తెలిపారు. తనపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ కట్టి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కలిసి డిమాండ్ చేస్తూ సీపీఎం నేతలతో కలిసి రాస్తారోకో చేశారు. ఆందోళనకారులతో సీఐ సురేష్, ఎస్ఐ రవిబాబు మాట్లాడి విరమింపజేశారు.



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు

12న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

తెనాలి: జిల్లాలోని తాడేపల్లిలో గల సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈనెల 12వ తేదీన ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం జరుగుతుందని గుంటూరు జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు చెట్టిపోగు లక్ష్మణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, ఎస్సీ వర్గీకరణ విజేత మందా కృష్ణమాదిగ పాల్గొంటారని తెలిపారు. ఇదే వేదికపై కృష్ణమాదిగ దంపతులకు ఘన సత్కారం ఉంటుందని, జిల్లాలోని మాదిగ ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మ్యూజియాల్లో కార్మికులను కొనసాగించాలి

అమరావతి: రాష్ట్రంలోని అమరావతి సర్కిల్ పరిధి లోగల ఏఎస్ఐ మ్యూజియాల్లో క్యాజువల్ లేబర్‌గా విధులు నిర్వర్తిస్తున్న 150 మందిని కొనసాగించాలని, గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తెలిపారు. ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి మహా చైత్యం, నాగార్జునకొండ మహాచైత్యం, గండికోట, లేపాక్షి, చంద్రగిరి పోర్ట్, శాలిగుండం, భట్టిప్రోలు, శంకరం ఏఎస్ఐ మ్యూజియాల్లో 10,15 సంవత్సరాలుగా పని చేస్తున్న క్యాజువల్ కార్మికులను ఉత్తర్వులు లేకుండా విధులకు హాజరు కావద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేయటం దారుణమన్నారు. గతంలో ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలనే నివేదిక ప్రస్తుతం డైరెక్టర్ జనరల్ ఆఫీస్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. ఆయన వెంట ఉద్యోగుల ప్రతినిధులు గడ్డం అమృత్ కుమార్, తెలగంశెట్టి చూడామణి, కందుల రమేష్ ఉన్నారు